# నా జీవితం....

[ కె. వి. జి. ఆచార్య ]

లోకంలో దురాచారాలు ప్రబలాయి అనడంలో సందేహం ఋసుమంతైనా లేదంటాను-కాని! ఎవరితప్పులు-లోట్లు-వారికి తెలియవు కాబోలు?—నా యీ దుస్థితికి కారకులెవరు?—ముమ్మాటికీ నా తలిదండ్రులే! అజ్ఞానాంధకారంలో నా పెళ్ళి జరగడం—మరుచటిలేప్రాయపు వర్షంలోనే ఆ మహానుభావుని కోల్పోవడం జరిగాయి—అయితే, నా యీ జన్మంతా వితంతువుగనే గడపాలా? నాకుమాత్రం నా యావ్వన సుఖాన్ని అనుభవించాలని వుండదూ?... ఈ పాలపొంగులవంటి శరీరాన్ని...యింకా నవనాగరికతా కవులందరూ వర్ణించే నా అంగాలపిపాస తీరే సమయం నా కక్కర్లేదు కాబోలు?—స్త్రీకి లోకంలో యేపని చేయడానిక్కి హక్కులు లేవంటారు—స్త్రీయంటే ఆడుకొనే జపాన్‌బొమ్మ అనుకొన్నారు—పాపం! నాకీ సంఘంతోను—యీ సంఘప్రజలతోను—సంఘపు కట్టుబాటులతోను సంబంధంలేదని తెలియదు కాబోలు-స్త్రీ స్వాతంత్రపు హక్కులకోసం నే పాటుబడ్డాను—

అందర్నీ ధిఃక్కరించాను—తలిదండ్రులకు తెలియకుండా కొన్నాళ్లు నాటకం జరిపాను—సాగినంతకాలం యేపని చేయడానికైనా అడ్డులేదు—నా బ్రతుకు తెరువులు నే స్వయంగా చూసుకోదలుచుకొన్నాను—నా ప్రియుడే అనుకోండి—లేదా నా భర్తే ...రాజుతో కార్యకలాపానికి పూనుకొన్నా—అతడు ధనవంతుడే—మేమిద్దరం యేలా ప్రేమకి గురిఅయ్యామో తెలియదు—కొన్నాళ్ళు మా జీవితగాధ అందరినోటంటా వెలువడింది—యెక్కడవిన్నా మా గాధే-ఓనాడు రాజుతో మద్రాసు పరారి అయ్యాను—యింక మద్రాసు పరిస్థితులు చెప్పాలా?—రాజు బి. ఏ. ప్యాసయ్యాడు గాబట్టి యేదో వుద్యోగం కొఅత తీరింది—హాయిగా మా యిద్దరి జీవితాలలో అడ్డులేకుండా సాగుతోంది—యిలా చేసినందుకు ఆ నీచపు సంఘాలుగాని—సంఘం రూల్సుగాని యేంచేయగల్గింది?—మొదట్లో కుక్కలు మొరిగినట్లు మొరిగి—చివరికి వినేవారు లేకపోయినందుకు అరువులు కట్టిపెట్టాయి—

కొన్నిసంవత్సరాలు గడిచాయి-రాజు పెద్ద ఆఫీసరయ్యాడు—యేదో పనిమీద మావూరు క్యాంప్ తగిలింది-కూడా నేగూడా వెళ్ళాను-రాజు ఆఫీసరు గాబట్టి—ఆదరణలు—గౌరవమర్యాదలు జరిగాయి-అంతేగాని ఒక్కరూ నోరు తెరవలేదు—

ఈలాంటి సంఘానికి భయపడియుంటే నా గతేమయేది? ఇప్పుడేమంటుంది యీ సంఘం? మంచిదానికి యీ సంఘంకాదు అంతేకదా?